

ముందస్తు వరితో మేలు

అకాల వర్షం నుంచి పంటను కాపాడుకు నేందుకు ముందస్తు వరిసాగు మేలని వ్యవసాయ శాస్త్రవేత్తలు పేర్కొన్నారు.

- 10లో ▸



అవకతవకలపై విచారణ

నాగిరెడ్డిపేటలోని కిచ్చన్నపేటలో స్త్రీనిధి రుణాల కిస్తీల చెల్లింపుల్లో అవకతవకలపై సెర్ప్ అధికారులు విచారణ చేపట్టారు.

- 10లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
39.6 /26.7

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. ఉదయం ఉక్కపోతగా ఉంటుంది. ఎండ తీవ్రత ఎక్కువగానే ఉండవచ్చు. సాయంత్రం వాతావరణం చల్లబడుతుంది.

సేవకు సలాం..

నేడు అంతర్జాతీయ నర్సుల దినోత్సవం

చల్లని చూపు, వెచ్చని ఓదార్పునకు ప్రతిరూపం నర్సు. మల్లె పూవుల్లాంటి తెల్లని దుస్తుల్లో ఆస్పత్రుల్లో రోగులకు ఆత్మబంధువులవుతారు నర్సులు. ఓర్పు, సహనంతో రోగుల దగ్గరకు వెళ్లి చిరునవ్వుతో పలకరిస్తూ సేవలు అందిస్తారు. అప్పటిదాకా దుఃఖం, బాధలో ఉన్న రోగికి, రోగి సహాయకులకు నర్సు ద్వారా లభించే ఆత్మీయ పలకరింపుతో సాంత్వన కలుగుతుంది. కరోనా మహమ్మారి మూలంగా ప్రపంచం మొత్తం అతలాకుతలమైన పరిస్థితుల్లో కూడా నర్సులు తమ ప్రాణాలను పణంగా పెట్టి విధులు నిర్వహించారు.



- ఓర్పు, సహనంతో రోగులకు నర్సుల సేవలు
- ఇంజక్షన్ నుంచి సర్జరీల వరకూ వారుండాల్సిందే
- వాళ్ల చేతుల మీదుగానే కాన్పులు

సాక్షి, కామారెడ్డి : సగం రోగం నర్సులు చూపే ప్రేమ, ఆప్యాయతలతోనే మటుమాయమవుతుందని చెబుతారు. చాలా మంది నర్సులు కరోనా బారిన పడి కోలుకుని మరీ సేవలందించారు. వారి ద్వారా కుటుంబ సభ్యులు కూడా కరోనా బారిన పడ్డ సంఘటనలున్నాయి. ఈ నెల 12న అంతర్జాతీయ నర్సుల దినోత్సవం సందర్భంగా 'సాక్షి' ప్రత్యేక కథనం. ఇంజక్షన్ చేయడమే కాదు, రక్తం కారుతున్న క్షతగాత్రుడికి కావాల్సిన సేవలందించడం, పురిటి నొప్పులతో వచ్చే గర్భిణికి ధైర్యాన్నిస్తూ కాన్పు చేయడం, ఆపరేషన్లు జరుగుతున్నపుడు తమవంతు పాత్ర పోషించడం ద్వారా వారు వృత్తికే వన్నె తెస్తారు. నర్సుల దినోత్సవం సందర్భంగా వారికి సెల్యూట్ చేయాల్సిందే !

అలిసినా.. శక్తిని కూడగట్టుకుని

రెండేళ్ల కిందట కరోనా వైరస్‌తో మంచంపట్టిన వేలాది మందికి సేవలందించడం ద్వారా నర్సులు ప్రజల అభిమానం చూరగొన్నారు. కరోనా బాధితుల ఇళ్లకు వెళ్లి మరీ వైద్య సలహాలు ఇవ్వడం, మందులు ఎలా వేసుకోవాలి, ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో వివరించడం ద్వారా ఎంతో మంది ప్రాణాలను కాపాడారు. అలాగే ఆస్పత్రుల్లో పనిచేసే స్టాఫ్ నర్సులు చాలా మంది పరీక్షలు నిర్వహించడం నుంచి వ్యాక్సిన్ ఇచ్చే వరకు ఎంతో ఓర్పుగా సేవలందించారు. నిత్యం వందలాది మందికి వ్యాక్సిన్ చేసి అలసిపోయినా, శక్తిని కూడగట్టుకుని విధులు నిర్వహించారు. ఒక్కోసారి వైరస్ బారిన పడి, తమ ద్వారా కుటుంబ సభ్యులకూ వైరస్ సోకి ఇబ్బందులు ఎదుర్కొన్నా, మొక్కవోని ధైర్యంతో వృత్తిధర్మాన్ని నిర్వహించారు. నిస్వార్థ సేవలకు ప్రతిరూపంగా నిలుస్తున్న నర్సులను ప్రజలు గుర్తుంచుకుంటారు.

అన్నింటా తామై..

ఆసుపత్రిలో రోగికి ఇంజక్షన్ చేసేది నర్సులే. క్షతగాత్రులకు సేవలందించేది వాళ్లే. ఆపరేషన్ అవుతుందంటే థియేటర్‌లో ఉండాల్సిందే. పురిటినొప్పులతో వచ్చిన గర్భిణీకి అన్ని రకాల సపర్యలు చేయడమేగాక, కాన్పు అయ్యేదాకా కంటికి రెప్పలా చూసుకునేది కూడా నర్సే. చాలాచోట్ల డాక్టర్ల పర్యవేక్షణలో నర్సులే కాన్పులు చేస్తారు. ఒక్కోసారి సమయానికి డాక్టర్ అందుబాటులో లేకుంటే నర్సులే ముందుండి కాన్పు చేయడం జరుగుతోంది. రోగికి మందుగోలి నోట్లో వేయించడం నుంచి కావాల్సిన అన్ని రకాల సపర్యలు కూడా చేయడం ద్వారా వారి అభిమానం చూరగొన్నారెందరో ఉన్నారు. చాలా మంది సిస్టర్ అనే పిలుస్తారు. కొందరు నర్స్ అమ్మా అని సంభోదిస్తారు. సమాజంలో నర్సులకు ఎంతో ప్రాముఖ్యత ఉంది. ఆపదలో మనకు సేవలు చేస్తారన్న భావనతో వారిని గౌరవిస్తారు.

బాధ్యతతో ముడిపడ్డ వృత్తి..



నర్సు ఉద్యోగం బాధ్యతతో ముడిపడి ఉన్నది. పరిచయం కూడా లేని వారిని ఆప్యాయంగా పలకరించి వారికి సేవలు చేయాల్సి ఉంటుంది. సేవలు చేయడంలో ఎంతో సంతృప్తి కలుగుతుంది.

–బి.మణి, స్టాఫ్‌నర్సు, కామారెడ్డి

పాతికేళ్లుగా సేవలందిస్తున్నా..



నర్సింగ్ వృత్తిలో 25 ఏళ్లుగా పనిచేస్తున్నాను. ఎంతో మందికి సేవలందించాను. ఆస్పత్రికి వచ్చిన పేషెంట్లకు మేం అందించే సేవలు వారు ఎప్పటికీ మరిచిపోరు. బయట ఎక్కడైనా కనబడితే చాలు దగ్గరకు వచ్చి పలకరిస్తారు.

– ఎం.రేణుక, హెడ్‌నర్స్, ఎల్లారెడ్డి

మమ్మల్ని ఎంతో గౌరవిస్తారు..



పదమూడేళ్లుగా వృత్తిలో కొనసాగుతున్నాను. ఆస్పత్రికి వచ్చే రోగులకు మేము ఇచ్చే ఓదార్పు ఎంతో గొప్పది. వాళ్లు కూడా మమ్మల్ని ఎంతో గౌరవిస్తారు. చాలామంది సిస్టర్ అని, అమ్మా అని పిలుస్తుంటారు. సేవలో సంతృప్తి ఉంది.

– ఎం.స్వర్ణ, స్టాఫ్‌నర్సు, ఎల్లారెడ్డి

జాతీయ అవార్డు సమష్టి కృషి..



పేదలకు సేవ చేయాలనే ఉద్దేశంతోనే వైద్యరంగంలోకి వచ్చా. నిజామాబాద్ ప్రభుత్వ ఆస్పత్రిలో 27 ఏళ్లు సేవలందించా. ఏడాది క్రితమే బాన్సువాడ ఆస్పత్రికి వచ్చా. బాన్సువాడ ఆస్పత్రికి జాతీయ అవార్డు రావడానికి సమష్టి కృషి కారణం.

– సుబ్బాయమ్మ హెడ్‌నర్సు, బాన్సువాడ

జోరుగా సేల్‌డీడ్ దందా!

- కొనసాగుతున్న వడ్డీ వ్యాపారం
- అవసరానికి అప్పు ఇచ్చి ప్లాట్లు, వ్యవసాయ భూములు సొంతం చేసుకుంటున్న వ్యాపారులు



బాన్సువాడ : బాన్సువాడ పట్టణానికి సమీపంలో ఉన్న గ్రామంలో ఓరైతు తన కూతురి వివాహం చేయాలని సంబంధం చూసి పెళ్లికి ముహూర్తం పెట్టుకున్నాడు. పెళ్లి ఖర్చులకు అవసరమయ్యే రూ. 6 లక్షల కోసం అదే గ్రామానికి చెందిన ఓ వడ్డీ వ్యాపారిని ఆశ్రయించాడు. ఆయన తన పేరుపై ఉన్న ఎకరం 20 గుంటల భూమిని రిజిస్ట్రేషన్(సేల్‌డీడ్) చేయిస్తే డబ్బులు ఇస్తానని వడ్డీ వ్యాపారి రైతుకు చెప్పడంతో రైతు ఒక్కసారిగా ఖంగుతిన్నాడు. గతంలో ఎన్నడూ ఈ విధంగా ఎవరికీ రాసివ్వలేదని, రైతు ఆవేదన చెందగా.. ఇష్టమైతే వ్యవసాయ భూమి రిజిస్ట్రేషన్ చేసి ఇస్తేనే డబ్బులిస్తానని లేకపోతే మీ ఇష్టమని తెగేసి చెప్పేశారు. దీంతో దిక్కుతోచని స్థితిలో తప్పని పరిస్థితుల్లో రూ.60 లక్షల విలువైన వ్యవసాయ భూమిని వడ్డీ వ్యాపారి పేరుపై రిజిస్ట్రేషన్ చేసేందుకు సిద్ధమయ్యాడు. ఇలా బాన్సువాడలో సేల్‌డీడ్ దందా జోరుగా కొనసాగుతుంది. సామాన్యుల అవసరాలను ఆసరా చేసుకున్న వడ్డీ వ్యాపారులు వారి నుంచి వడ్డీ రూపంలో అందినంత దండుకుంటున్నారు. ఒక్కంటికి పదింతల విలువ ఉన్న ప్లాట్లు, వ్యవసాయ భూములను రిజిస్ట్రేషన్ చేసుకుని వడ్డీ వ్యాపారం కొనసాగిస్తున్నారు. వ్యవసాయ భూమిని రిజిస్ట్రేషన్ చేయించడమే కాకుండా నెలకు రూ. 2 నుంచి రూ.3 వరకు వడ్డీల రూపంలో చెల్లించాల్సి ఉంటుంది. వ్యవసాయ భూములే కాకుండా ప్లాట్లు రిజిస్ట్రేషన్ చేసుకుని వడ్డీకి డబ్బులు ఇస్తున్నారు. నిర్ణీత సమయంలో వడ్డీతో సహా డబ్బులు చెల్లించలేని పరిస్థితిలో సదరు వ్యవసాయ భూమి, ప్లాట్లను వడ్డీ వ్యాపారి సొంతం చేసుకుంటాడు. అసలు కంటే వడ్డీలే అధికం కావడంతో కొందరు భూములు, ప్లాట్లు అమ్ముకుని అప్పులు చెల్లిస్తున్నారు.

బీర్కూర్ మండలంలో..

బీర్కూర్ మండలంలోని గ్రామంలో ఓ వ్యక్తి తన అవసరాల కోసం ఓ మహిళకు రెండెకరాల వ్యవసాయ భూమి సేల్‌డీడ్ చేసి రూ. 20 లక్షల వడ్డీకి తీసుకున్నాడు. అప్పు తీసుకున్న వ్యక్తి హైదరాబాద్‌లో ఉండడంతో పరిచయం ఉన్న ఓ వ్యక్తికి ప్రతినెలా వడ్డీ డబ్బులు చెల్లిస్తూ వచ్చాడు. ఏడాదిన్నరగా అప్పు తీసుకున్న వ్యక్తి సదరు గ్రామానికి రాకపోవడంతో వడ్డీకి డబ్బులు ఇచ్చిన మహిళ సదరు వ్యక్తికి సంబంధించిన మూడెకరాల వ్యవసాయ భూమిని కబ్జా చేసి పంట సాగు చేసింది. ఇటీవల హైదరాబాద్ నుంచి సదరు వ్యక్తి గ్రామానికి వచ్చి మహిళను కలిసి నీ డబ్బులు అసలు, వడ్డీతో సహా చెల్లిస్తానని చెప్పడంతో నీకు ఇచ్చిన అసలు, వడ్డీతో కలిపి నీ మూడెకరాల భూమిని ధరకు సరిపోయిందని భూమి గురించి ఇక మర్చిపోవాలంటూ అప్పు తీసుకున్న వ్యక్తిని మహిళ ముప్పుతిప్పలు పెట్టింది. ఇలా ఒక్కరిద్దరు కాదు వందల సంఖ్యలో బాధితులు వడ్డీ వ్యాపారుల చేతితో మోసపోతున్నారు. అధికారులు, స్థానిక నాయకుల సహకారంతో వడ్డీ వ్యాపారులు ఇష్టారాజ్యంగా దందా చేస్తున్నారు.

ఫెయిలైతే అసంతృప్తి వద్దు

- రెండో ప్రయత్నంలో విజయం సాధించొచ్చు
- కలెక్టర్ జితేష్ వి పాటిల్

కామారెడ్డి క్రైం : పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించలేకపోయినవారు అసంతృప్తికి లోను కావద్దని కలెక్టర్ జితేష్ వి పాటిల్ సూచించారు. గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. పదవ తరగతి, ఇంటర్ ఫలితాల్లో ఫెయిల్ అయినప్పటికీ విద్యార్థులకు జీవితంలో ఎన్నో అవకాశాలు లభిస్తాయన్నారు. అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు రాసి రెండవసారి ప్రయత్నంలో విజయం సాధించవచ్చని సూచించారు. విద్యార్థులకు మార్కులు ముఖ్యం కాదని, వారిని తల్లిదండ్రులు తక్కువ అంచనా వేయకూడదని సూచించారు. తాను కూడా ఐఏఎస్ మొదటి ప్రయత్నంలో ఫెయిలై రెండో ప్రయత్నంలో ఐఏఎస్ ఉత్తీర్ణత సాధించి కలెక్టర్ అయ్యానన్నారు.

వయోవృద్ధుల పోషణ, ఫిర్యాదులకు వెబ్‌పోర్టల్

- ప్రారంభించిన కలెక్టర్ జితేష్ వి పాటిల్



వెబ్‌పోర్టల్ ప్రతులను ఆవిష్కరిస్తున్న కలెక్టర్

కామారెడ్డి క్రైం : తెలంగాణ వికలాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ డైరెక్టర్ శైలజ సూచనల మేరకు కామారెడ్డి కలెక్టర్ జితేష్ వి పాటిల్, అదనపు కలెక్టర్ వెంకటేష్ ధోత్రే వయోవృద్ధుల పోషణ ఫిర్యాదుల వెబ్ పోర్టల్‌ను కలెక్టరేట్‌లో గురువారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నిరాధరణకు గురైన తల్లిదండ్రులు లేదా వయోవృద్ధుల పోషణ సంరక్షణ చూసుకుని పిల్లలపై ఆన్‌లైన్‌లో సీనియర్ సిటిజన్ మెయింటెనెన్స్ కేసెస్ మోనిటరింగ్ సిస్టం వెబ్ పోర్టల్‌లో ఫిర్యాదు చేయాలని చెప్పారు. వయోవృద్ధులు మొబైల్ ఫోన్, ఆన్‌లైన్ కేంద్రాల ద్వారా ఈ వెబ్ పోర్టల్‌లో నమోదు చేసుకోవచ్చన్నారు. అప్పిలేట్ ట్రిబ్యునల్ కలెక్టర్‌కు ఫిర్యాదులు నమోదు చేసుకునే వీలుందన్నారు. వయోవృద్ధులు ఫిర్యాదు నమోదు చేసే విధానంలో ఇబ్బందులు ఉన్నట్లయితే వయోవృద్ధుల హెల్ప్‌లైన్ 14567ని సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమాధికారి రమ్య, ఫీల్డ్ రెస్పాన్స్ ఆఫీసర్ నరేష్ పాల్గొన్నారు.

సిబ్బంది కొరతతో ఇబ్బందులు

- సదాశివనగర్‌లోని ఎంపీడీవో ఆఫీస్‌లో అవస్థలు
- ఐదుగురు ఉద్యోగులు డిప్యుటేషన్‌పై ఉండడంతో ప్రజలకు ఇక్కట్లు
- అన్నీతానై పనిచేస్తోన్న జూనియర్ అసిస్టెంట్



సదాశివనగర్ ఎంపీడీవో ఆఫీస్‌లో పనిచేస్తున్న ఏకైక ఉద్యోగి శేషాచారి

సదాశివనగర్(ఎల్లారెడ్డి) : సదాశివనగర్ మండల పరిషత్ కార్యాలయంలో సిబ్బంది కొరతతో మండల ప్రజలకు ఇబ్బందులు తప్పడంలేదు. ఎంపీడీవో సహకారంతో అన్ని సేవలు జూనియర్ అసిస్టెంట్ చేయాల్సి దుస్థితి ఏర్పడుతోంది. ప్రతినెలా వేతనాలు సదాశివనగర్‌లో తీసుకుంటూ ఇతర మండలాల్లో ఐదుగురు ఉద్యోగులు విధులు నిర్వహిస్తుండడంతో మండల ప్రజలకు తీవ్ర అవస్థలు పడుతున్నారు. కార్యాలయంలో ఎంపీడీవోతో పాటు జూనియర్ అసిస్టెంట్ ఒక్కరు మాత్రమే విధులు నిర్వర్తిస్తున్నారు. కంప్యూటర్‌కు సంబంధించిన రికార్డుల నిర్వహణ, పింఛన్ల నమోదు తదితర అంశాలను నమోదు చేయడం, కార్యాలయానికి వచ్చిన ప్రతి ఒక్కరికి సమాధానం చెప్పడం ఇబ్బందిగా మారింది. పని చేయడం ఒక చోట.. జీతాలు మాత్రం ఎంపీడీవో ఆఫీసులో తీసుకోవడం ఏమిటని మండల ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. సదాశివనగర్‌లో సూపరింటెండెంట్‌గా పనిచేసిన ఉద్యోగిని డిప్యూటేషన్‌పై మాచారెడ్డి మండలానికి, సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేసిన వ్యక్తిని రామారెడ్డి మండల పరిషత్ కార్యాలయానికి, టైపిస్ట్‌ను రాజంపేట్ మండలానికి, అటెండర్‌గా పని చేస్తున్న వ్యక్తిని రామారెడ్డి మండలానికి డిప్యూటేషన్‌పై పంపించారు. కార్యాలయంలో పనిచేస్తున్న ఒకేఒక్కడు శేషాచారి ప్రతిరోజు విధులకు హాజరవుతూ సెలవులు కూడా తీసుకోలేని పరిస్థితి ఏర్పడింది.

చర్యలుంటాయా.. ఒక్కటవుతారా..?

- తెయూలో అక్రమాలపై ఈసీ తీర్మానాలు అమలయ్యేనా..
- ఈసీ, వీసీ, రిజిస్ట్రార్ అంతా కలిసిపోతారా..
- ఇటీవల చోటుచేసుకున్న పరిణామాల నేపథ్యంలో సాగుతున్న చర్చ
- నేడు హైదరాబాద్‌లో పాలకమండలి సమావేశం



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: తెలంగాణ విశ్వవిద్యాలయంలో చోటుచేసుకున్న అక్రమాలు, నిధుల దుర్వినియోగం తదితర అంశాలపై వైస్ చాన్స్‌లర్, పాలకమండలి సభ్యుల మధ్య వాడి వేడి వాతావరణం నెలకొంది. ఈ క్రమంలో 17 నెలల సుదీర్ఘ సమయం తరువాత గత నెల 19న, 26న, ఈ నెల 5న హైదరాబాద్‌లో తెయూ పాలకమండలి సమావేశాలు జరిగాయి. వీసీ అక్రమాలకు పాల్పడ్డారని, క్రిమినల్ చర్యల దిశగా ముందుకెళ్లాలని ఈసీ సభ్యులు తీర్మానం చేశారు. అయితే తాజా పరిణామాలు చూస్తుంటే వీసీ, రిజిస్ట్రార్, పాలకమండలి సభ్యులు సర్దుకుపోయి గమ్మునుంటారా అనే చర్చ విద్యార్థి సంఘాలు, ప్రొఫెసర్ల మధ్య నడుస్తోంది. నేడు మరోసారి హైదరాబాద్‌లో ఈసీ సమావేశం జరుగనుంది. ఈ నేపథ్యంలో గత మూడువారాల్లో నిర్వహించిన ఈసీ సమావేశాల్లో తీసుకున్న తీర్మానాల అమలు విషయమై ఏమైనా స్పష్టత వచ్చేనా? అనే చర్చ యూనివర్సిటీ వర్గాల్లో నడుస్తోంది. అయితే గత నెల 19న చేసిన ఈసీ తీర్మానాలపై వీసీ హైకోర్టు నుంచి స్టే తీసుకురాగా, తరువాత గతనెల 26న, ఈ నెల 5న చేసిన తీర్మానాల విషయమై ఏమేరకు ముందుకెళతారనే విషయమై పలువురు పలురకాలుగా అభిప్రాయపడుతున్నారు.

రిజిస్ట్రార్‌గా కనకయ్య అక్రమాలపై..

కనకయ్య రిజిస్ట్రార్‌గా ఉన్న సమయంలో అక్రమ నియామకాలు, అడ్డగోలు చెల్లింపులు, నిధుల దుర్వినియోగం, నలుగురు ప్రొఫెసర్ల సర్వీసు పుస్తకాలు ఇంటికి తీసుకెళ్లి జిరాక్స్‌లు తీసి మరీ పంచి పెట్టారని ఆరోపణలు ఉన్నాయి. నోటిఫికేషన్ లేకున్నప్పటికీ నిబంధనలకు విరుద్ధంగా పాత సర్వీస్ కలుపుకుని సొంతంగా ఉత్తుత్తి ఇంటర్వ్యూతో సీనియర్ ప్రొఫెసర్‌గా ప్రమోషన్ ఇచ్చుకోవడం తదితర వ్యవహారాలపై క్రిమినల్ కేసులు పెట్టాలని 2021 అక్టోబర్ 30న జరిగిన పాలకమండలి సమావేశంలో నిర్ణయించారు. అయితే ఇప్పటివరకు అమలు కాలేదు.

శంఖులో పోస్తే తీర్థమన్నట్లుగా..

అవుట్ సోర్సింగ్, పార్ట్‌టైం సిబ్బందికి ప్రమోషన్లు ఇచ్చే నిబంధనలు లేవు. అయినప్పటికీ వీసీ ఇవ్వడంతో ఈసీ రద్దు చేసింది. అయితే ఇక్కడ విచిత్రమేమిటంటే ఈ ప్రమోషన్లను ఇవ్వవచ్చని తాజాగా ఈసీ నియామకం చేసిన రిజిస్ట్రార్ యాదగిరి చెబుతుండడం విశేషం. అలాగే ఈసీ అనుమతి లేకుండా కొత్త నియామకాలు చేయకూడదని తీర్మానం చేశారు. అయినప్పటికీ అవసరాన్ని బట్టి నియామకాలు చేస్తామని రిజిస్ట్రార్ యాదగిరి చెబుతుండడం గమనార్హం. సిబ్బంది సర్దుబాటు తప్ప నియామకాలు వద్దని చెప్పినప్పటికీ ముందుకే వెళుతండడం విశేషం.

కేసుల విత్‌డ్రాపై పరస్పర అంగీకారం!

నియామకాలు, నిధుల వినియోగంపై తనపై ఏసీబీ, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ కేసులు పెట్టాలని చేసిన తీర్మానం వెనక్కు తీసుకోవాలని వీసీ ఈసీని కోరారు. దీంతో గత 19న ఈసీ నిర్ణయాలపై హైకోర్టు స్టే ఆర్డర్‌ను ఉపసంహరించేలా చేయాలని ఈసీ వీసీని కోరడం విశేషం.

ఈ నేపథ్యంలో శుక్రవారం జరగనున్న పాలకమండలి సమావేశం తీసుకునే నిర్ణయాలు స్పష్టతనిస్తాయా అనే పరిస్థితి నెలకొంది. తెయూలో చోటుచేసుకున్న అక్రమ నియామకాలు, నిధుల దుర్వినియోగంపై ఇప్పటివరకు ఈసీ సభ్యులు చేసిన తీర్మానాలకు కట్టుబడతారా అనే చర్చ నడుస్తోంది. కాగా వీసీ రవీందర్ నేటి పాలకమండలి సమావేశానికి హాజరు అవుతారని రిజిస్ట్రార్ యాదగిరి తెలిపారు. గత ఈసీ నిర్ణయాలపై నేటి సమావేశంలో స్పష్టత వచ్చే అవకాశం ఉందని పేర్కొన్నారు.

విద్యావర్ధిని సస్పెన్షన్‌పై..

గత నెల 19న పాలకమండలి తీసుకున్న నిర్ణయాలపై వీసీ కోర్టు నుంచి స్టే తెచ్చుకోగా, తరువాత 26న జరిగిన సమావేశంలో విద్యావర్ధినిపై సస్పెన్షన్ వేటు వేశారు. తక్షణమే అమలులోకి వస్తుందని తీర్మానం చేశారు. అయినప్పటికీ ఇప్పటివరకు రిజిస్ట్రార్ సస్పెన్షన్ ఆర్డర్ ఇవ్వలేదు.

- సూపరింటెండెంట్ నుంచి అసిస్టెంట్ రిజిస్ట్రార్‌లుగా ఇద్దరికి ఇచ్చిన ప్రమోషన్లను 2021లోనే ఈసీ రద్దు చేసినప్పటికీ వీసీ మళ్లీ ఇచ్చారు. వీటిపై ఈసీ ఏ నిర్ణయం తీసుకుంటుందో చూడాల్సి ఉంది.

న్యూస్‌రీల్

ఉపాధి అవకాశాల కోసం దరఖాస్తు చేసుకోండి

కామారెడ్డి అర్బన్ : గిరిజన నిరుద్యోగ యువకులు ఉపాధి శిక్షణ అవకాశాల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా గిరిజన సంక్షేమ అధికారి శ్రీనివాస్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు శాఖకు చెందిన సైట్‌లో దరఖాస్తు చేయాలన్నారు.

హెడ్ మాస్టర్లు నామినల్ రోల్స్ అందించాలి

కామారెడ్డి అర్బన్ : పదవ తరగతిలో ఫెయిలైన విద్యార్థులకు వచ్చేనెల 14వ తేదీ నుంచి 22వ తేదీ వరకు పరీక్షలున్నందున ఆయా పాఠశాలల హెడ్‌మాస్టర్లు ఈనెల 31లోగా నామినల్ రోల్స్ అందజేయాలని డీఈవో ఎస్ రాజు ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు మార్కుల రీకౌంటింగ్, రీ వెరిఫికేషన్ కోసం చలాన్ జతచేసి దర ఖాస్తులు అందజేయాలని డీఈవో సూచించారు.

ధరణిలో వసతుల కోసం ప్రతిపాదించండి



కామారెడ్డి క్రైం : ధరణి టౌన్షిప్‌లో మౌలిక వసతుల కల్పన కోసం ప్రతిపాదనలను తయారు చేయాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అధికారులకు సూచించారు. కామారెడ్డి కలెక్టరేట్‌లో గురువారం ధరణి టౌన్షిప్‌పై అధికారులతో సమీక్ష నిర్వహించారు. బీటీ రోడ్లు, మురుగు కాలువలు, విద్యుత్ సౌకర్యం లాంటి సౌకర్యాల కోసం ప్రతిపాదనలను అధికారులు సిద్ధం చేసి ఉన్నతాధికారులకు పంపాలని సూచించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ వెంకటేష్ దోత్రే, టీపీవో గిరిధర్, ఆర్అండ్‌బీ డీఈ శ్రీనివాస్, మున్సిపల్ డీఈ వాసుదేవ రెడ్డి, రాజీవ్ స్వగృహ ఏజీఎం సత్యనారాయణ, పర్యవేక్షకుడు సాయి భుజంగరావు, తహసిల్దార్ వెంకట్ రావు, అధికారులు పాల్గొన్నారు.

ఎప్పటికప్పుడు లోడింగ్ చేయించాలి

- రెవెన్యూ అదనపు కలెక్టర్ చంద్రమోహన్

కామారెడ్డి క్రైం : కొనుగోలు కేంద్రాలలో ట్యాబ్ ఎంట్రీ సజావుగా నిర్వహించాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ చంద్రమోహన్ అన్నారు. కామారెడ్డి కలెక్టరేట్ నుంచి గురువారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, వ్యవసాయ, రెవెన్యూ అధికారులతో సమీక్ష నిర్వహించారు. రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే సంబంధిత పత్రాలతో రైతు వివరాలను ట్యాబ్‌లో నమోదు చేయాలన్నారు. రైతులకు సకాలంలో డబ్బులు వచ్చేలా చూడాలన్నారు. కొనుగోలు కేంద్రాల వారిగా వివరాలను నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. సమస్యలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ధాన్యం ఎప్పటికప్పుడు లోడింగ్ చేయించి రైస్‌మిల్లులకు తరలించాలని సూచించారు. వీసీలో డీఎస్‌వో పద్మ, సివిల్ సప్లయ్ డీఎం అభిషేక్ సింగ్, జిల్లా సహకార అధికారిని వసంత, ఆర్డీవోలు శ్రీనివాస్ రెడ్డి, శీను, రాజాగౌడ్, వ్యవసాయ, రెవెన్యూ, సహకార శాఖల అధికారులు పాల్గొన్నారు.

లక్ష్యానికి అనుగుణంగా మిల్లింగ్ చేయాలి

కామారెడ్డి క్రైం : రైస్ మిల్లర్లు లక్ష్యానికి అనుగుణంగా మిల్లింగ్ చేయాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ చంద్రమోహన్ సూచించారు. కామారెడ్డి కలెక్టరేట్‌లో గురువారం రైస్‌మిల్లర్లతో సమీక్ష నిర్వహించారు. రైస్‌మిల్లుల యజమానులు మిల్లింగ్ సక్రమంగా చేపట్టకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో డీఎస్‌వో పద్మ, సివిల్ సప్లయ్ డీఎం అభిషేక్ సింగ్, అధికారులు, రైస్‌మిల్లుల యజమానులు పాల్గొన్నారు.

డిగ్రీ పరీక్ష ఫీజు చెల్లించాలి

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో జూన్‌లో జరుగనున్న డిగ్రీ సెమిస్టర్ పరీక్షల ఫీజు ఈ నెల 16వరకు చెల్లించాలని కంట్రోలర్ ప్రొఫెసర్ అరుణ ఒక ప్రకటనలో తెలిపారు. బీఏ, బీకాం, బీఎస్సీ, బీబీఏ కోర్సులకు చెందిన 2వ, 4వ, 6వ సెమిస్టర్ రెగ్యులర్, 1వ, 3వ, 5వ సెమిస్టర్స్ బ్యాక్‌లాగ్ థియరీ పరీక్షలకు ఈ షెడ్యూల్ వర్తిస్తుందని కంట్రోలర్ తెలిపారు. రూ.100ల అపరాధ రుసుముతో మే 18వరకు, రూ.500ల అపరాధ రుసుముతో మే 19వరకు పరీక్ష ఫీజు చెల్లించే అవకాశం ఉంటుందని కంట్రోలర్ తెలిపారు. విద్యార్థులు ఈ విషయాన్ని గమనించాలని, పూర్తి వివరాలకు www.telanganauniversity.ac.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలన్నారు.

క్లుప్తంగా

బాలుడి మృతి కేసులో నానమ్మే నిందితురాలు

కమ్మర్‌పల్లి: మండల కేంద్రంలోని ఎస్సారెస్పీ వరద కాలువలో పడి మూడున్నరేళ్ల బాలుడు మృతి చెందిన ఘటనలో నానమ్మే నిందితురాలని పోలీసుల విచారణలో తేలింది. భీమ్‌గల్ సీఐ వెంకటేశ్వర్లు గురువారం తెలిపిన వివరాలు ఇలా.. కమ్మర్‌పల్లికి చెందిన వెల్మ గంగాధర్ భార్య చనిపోవడంతో వారి కొడుకు మూడున్నరేళ్ల లక్కీని నానమ్మ నాగవత్తుల గంగవ్వ చూసుకునేది. చిత్తుకాగితాలు ఏరుకుంటూ జీవనం సాగించే గంగవ్వకు ఆర్థిక పరిస్థితి బాగా లేకపోవడంతో బాలుడి పోషణ భారంగా మారింది. ఈక్రమంలో లక్కీని చంపాలనే ఉద్దేశంతో నానమ్మ బుధవారం ఉదయం బాలుడిని వరద కాలువ వద్దకు తీసుకెళ్లి ఎవరులేని సమయం చూసి కాలువలో తోసేసింది. అనంతరం ఇంటికి చేరుకుంది. మధ్యాహ్నం వరద కాలువలో బాలుడి మృతదేహం నీటిపై తేలియాడుతూ కనిపించింది. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు విచారణ ప్రారంభించారు. గంగవ్వను పోలీసులు విచారించగా, లక్కీని కాలువలో తోసేసినట్లు అంగీకరించింది. నిందితురాలిని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

మెడికల్ కళాశాలకు భర్త మృతదేహం అప్పగింత



నిజామాబాద్ సిటీ: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన భర్త మృతదేహాన్ని భార్య మెడికల్ కళాశాలకు అప్పగించింది. మాక్లూర్ మండలం గొటుముక్కల గ్రామానికి చెందిన పాత లక్ష్మీ తన భర్త పాత నాగభూషణంతో(ఆర్‌ఎంపీ వైద్యుడు) కలిసి టీవీఎస్ ఎక్స్‌ఎల్‌పై ఈ నెలా 9న నిజామాబాద్‌కు వచ్చింది. తిరిగి వారి గ్రామానికి వెళ్తుండగా జిల్లా కేంద్రంలో వారి బైక్‌ను బుల్లెట్ బైక్ ఢీకొంది. ఈ ఘటనలో నాగభూషణంకు తీవ్రంగా గాయాలు కావటంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. భార్యభర్తలు 2018లో శరీరదానం చేసేందుకు నిర్ణయించుకున్నారు. ఈ మేరకు భార్య లక్ష్మీ గురువారం భర్త మృతదేహాన్ని నిజామాబాద్ మెడికల్ కళాశాలకు అప్పగించింది. సర్పంచ్ దారం ప్రవీణ్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

చర్చనీయాంశమైన బోధన్‌లో చోరీయత్నం?

బోధన్‌టౌన్(బోధన్): బోధన్‌లోని ఓ బ్యాంకు వద్ద రూ. 2 లక్షల చోరీ ఘటన గురువారం చర్చనీయాంశంగా మారంది. పట్టణంలోని ఓ బ్యాంకుకు ఓ ఖాతాదారుడు రూ. 2 లక్షలు విత్‌డ్రా చేసుకొని తన బైక్ వద్దకు వచ్చాడని, డబ్బులు వాహనంలో పెట్టి కిందగి వంగగా పక్కనే ఉన్న గుర్తు తెలియని వ్యక్తి డబ్బుల బ్యాగు ముట్టగా, పైకి లేచిన వ్యక్తి ప్రశ్నించడంతో డబ్బులను అక్కడే వదిలి పారిపోయాడని తెలిసింది. ఈవిషయమై బ్యాంకు అధికారులను వివరాలు కోరగా తన దృష్టికి రాలేదని, పట్టణ సీఐ ప్రేమ్‌కుమార్‌ను అడుగగా తమకు ఫిర్యాదు అందలేదని తెలిపారు.

తప్పిన ప్రమాదం



ఎల్లారెడ్డిరూరల్: మండలంలోని కొట్టాల్ గ్రామ శివారులోని ప్రధాన రహదారిపై గురువారం లారీ నుంచి ధాన్యం బస్తాలు రోడ్డుపై పడి పోయాయి. అయితే ఆ సమయంలో ఎలాంటి వాహనాలు రాకపోకలు సాగించకపోవడంతో పెను ప్రమాదం తప్పినట్టైంది.

ముందస్తు వరి సాగుతో మేలు

- ప్రకృతి వైపరీత్యాల నుంచి పంటలను కాపాడుకోవచ్చు
- రైతులతో చర్చాగోష్టిలో వ్యవసాయ శాస్త్రవేత్తల సూచన



మాట్లాడుతున్న శాస్త్రవేత్త రఘురాంరెడ్డి



చర్చాగోష్టికి హాజరైన రైతులు

రుద్రూర్: అకాల వర్షాలు, వడగండ్ల వాన నుంచి పంటను కాపాడుకునేందుకు వరి నాట్లు ముందస్తుగా వేయాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచించారు. రుద్రూర్ కృషి విజ్ఞాన కేంద్రం, వరి పరిశోధన కేంద్రం ఆధ్వర్యంలో గురువారం ఉమ్మడి జిల్లాలోని అభ్యుదయ రైతులతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ముందస్తు వరి సాగుపై రైతులతో చర్చాగోష్టి నిర్వహించారు. వర్ని, బాన్సువాడ ప్రాంతాల్లో ముందస్తు వరి సాగు చేస్తున్న రైతుల అనుభవాలు తెలుసుకున్నారు. ముందస్తు వరి సాగుపై రైతుల నుంచి మిశ్రమ స్పందన వచ్చింది. ఈ విధానంలో పచ్చి ధాన్యం సేకరణ ప్రధానమని, సఫలికృతం కావాలంటే సరైన రోడ్డు సౌకర్యం ఉండాలని గోపాల్ రెడ్డి అనే రైతు తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. వరి సాగులో రైతుల సందేహాలను వ్యవసాయ శాస్త్రవేత్తలు నివృత్తి చేశారు. బీపీటీకి ప్రత్యామ్నాయంగా రూపొందించిన నూతన వరి వంగడాల గురించి వివరించారు.

నూతన రకాలను సాగు చేయాలి

రాజేంద్రనగర్ వరి పరిశోధన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త పి రఘురాంరెడ్డి మాట్లాడుతూ దీర్ఘకాలిక వరి రకాలను మే రెండో పక్షంలో నారు పోసుకుని, జూన్ రెండో పక్షంలో నాటితే అక్టోబర్ చివరి వరకు అధిక దిగుబడులతో పంటను పొందవచ్చని సూచించారు. జిల్లాలో ఎక్కువగా బీపీటీ-5204 రకాన్ని సాగు చేస్తున్నారని, దీనికి రోగాలను తట్టుకునే శక్తి తక్కువగా ఉంటుందన్నారు. నూతన వంగడాలు జేజీఎల్-28545, కేఎన్‌ఎం-1638 రకాలను సాగు చేసి మంచి దిగుబడులు పొందాలని సూచించారు. జగిత్యాల పొలాస పరిశోధన కేంద్రం సహ పరిశోధన సంచాలకులు(ఏడీఆర్) జి శ్రీనివాస్ మాట్లాడుతూ.. వానాకాలంలో ముందస్తుగా వరి సాగు చేసుకుంటే పంట పెరుగుదలకు వాతావరణం అనుకూలంగా ఉంటుందన్నారు. చీడపీడల సమస్య తక్కువగా ఉండి అధిక దిగుబడి సాధించవచ్చని సూచించారు. జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. రైతులకు ఎక్కువ హెడ్ రైస్ రికవరి వచ్చే విత్తనాలు, తాలు గింజలు రాని విత్తనాలను అందచేయాలని శాస్త్రవేత్తలను కోరారు. కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం కో ఆర్డినేటర్ ఎస్ నవీన్‌కుమార్, వ్యవసాయ పరిశోధన కేంద్రం హెడ్ బి బాలాజీనాయక్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ల మంజూరులో నిర్లక్ష్యమేలా!



వెల్కటూర్ శివారులో చోరీకి గురైన ట్రాన్స్‌ఫార్మర్లను పరిశీలిస్తున్న అధికారులు (ఫైల్)

- మార్చిలో వెల్కటూర్ శివారులో ఏడు ట్రాన్స్‌ఫార్మర్ల చోరీ
- ఇప్పటివరకు పునరుద్ధరించని ట్రాన్స్‌కో అధికారులు
- ఇబ్బందులు పడుతున్న రైతులు

బాల్కొండ: సాగుకు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల మంజూరులో ట్రాన్స్‌కో అధికారులు నిర్లక్ష్యం వహించడంతో రైతులకు తిప్పలు తప్పడం లేదు. మెండోరా మండలం వెల్కటూర్ శివారులోని కాకతీయ కాలువ అంచున ఉన్న ఏడు ట్రాన్స్‌ఫార్మర్లను గుర్తు తెలియని దుండగులు మార్చి నెలలో ధ్వంసం చేసి కాపర్ తీగ, ఆయిల్ ఎత్తుకెళ్లారు. అప్పటినుంచి బోర్లకు విద్యుత్ సరఫరా లేకపోవడంతో పంటపొలాలకు నీరు అందించుటకు రైతులకు తిప్పలు పడుతున్నారు. అకాల వర్షాలు కురువడం వల్ల చివరి పంటలు కొద్ది మేరా గట్టెక్కాయి. కానీ ఇప్పటికీ ట్రాన్స్‌ఫార్మర్లను పునరుద్ధరించడంలో అధికారులు తీవ్ర నిర్లక్ష్యాన్ని చూపుతున్నారు.

60ఎకరాలకు పైప్‌లైన్ నీరే..

వెల్కటూర్ శివారులో రైతులు కాకతీయ కాలువ లీకేజీ నీటి ఆధారంగా విద్యుత్ మోటర్లను అమర్చుకుని నీటిని పైపులైన్‌ల ద్వారా పంటపొలాలకు అందిస్తున్నారు. మోటర్లకు విద్యుత్ సరఫరా కావాలంటే ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయాలి. కానీ ఇక్కడ ఇప్పటి వరకు ఒక్క అడుగు కూడ ముందుకు పడలేదు. ఏడు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల పరిధిలో 60ఎకరాలకు సాగు నీరు అందుతుంది. మరో 15రోజులు అయితే రోహిణి కార్తె ప్రారంభమవుతుంది. ఈక్రమంలో విత్తనాలు విత్తాలంటే నీటి అవసరం ఉంటుంది. నెలన్నర కావస్తున్నా ఇప్పటికీ కనీసం ఎఫ్‌ఐఆర్ కాపీని కూడ స్థానిక పోలీస్ స్టేషన్ నుంచి ట్రాన్స్‌కో అధికారులు పొందలేరు. ట్రాన్స్‌ఫార్మర్ల కోసం రైతులు అధికారుల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకనే వారేలేరని ఆందోళన చెందుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి వెంటనే విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు పునరుద్ధరించాలని అన్నదాతలు కోరుతున్నారు.

త్వరలోనే పునరుద్ధరిస్తాం..

దుండగులు ఎత్తుకెళ్లిన ట్రాన్స్‌ఫార్మర్ల స్థానంలో కొత్త ట్రాన్స్‌ఫార్మర్లను త్వరలోనే పునరుద్ధరిస్తాం. గాలివానాల వల్ల ఇతర స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు పడిపోవడంతో వాటి మరమ్మతుల పనిలో ఉన్నాం . ఉన్నతాధికారులకు ఇది వరకే నివేదించాం.

– మహ్మద్ అంజాత్ పాషా,
ట్రాన్స్‌కో ఏఈ, మెండోరా

సర్వీస్ రోడ్డు మంజూరు చేయాలి





హైవేపై ధర్నా నిర్వహిస్తున్న ఆందోళనకారులు.. సముదాయిస్తున్న పోలీసులు

డిచ్‌పల్లి: మండలంలోని సుద్దపల్లి శివారు సీఎంసీ క్రాసింగ్ వద్దగల 44వ నెంబర్ జాతీయ రహదారిపై సర్వీస్ రోడ్డు మంజూరు చేయాలని స్థానిక గ్రామాల ప్రజలు డిమాండ్ చేశారు. ఈమేరకు చుట్టు పక్కల 8 గ్రామాల ప్రజలు గురువారం తరలివచ్చి రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. ఈసందర్భంగా ఆందోళనకారులు మాట్లాడుతూ.. సీఎంసీ క్రాస్‌రోడ్డు వద్ద పదేళ్లలోనే సుమారు 70మంది వరకు మరణించారని, 20మంది వరకు వికలాంగులుగా మారారని ఆవేదన వ్యక్తం చేశారు. సర్వీస్ రోడ్డు కోసం ఎన్నిసార్లు విన్నవించినా, ఎవరూ పట్టించుకోవడం లేదని సుద్దపల్లి సర్పంచ్ రూపసతీష్‌రెడ్డి, సుద్దులం సర్పంచ్ వెంకటేష్, సాంపల్లి తండా సర్పంచ్ జగదీశ్, మెంట్రాజ్‌పల్లి సర్పంచ్ నర్సయ్య ఆరోపించారు. వెంటనే రహదారికి ఇరువైపులా సీఎంసీ నుంచి సుద్దపల్లి గ్రామం వరకు సర్వీస్ రోడ్డు వెంటనే నిర్మించాలని డిమాండ్ చేశారు. లేదంటే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు కొనసాగిస్తామని హెచ్చరించారు. రాస్తారోకో వల్ల రహదారిపై ఇరువైపులా వాహనాలు నిలిచిపోయాయి. ఎస్సై గణేష్ ఆధ్వర్యంలో పోలీసులు అక్కడికి చేరుకుని ఆందోళనకారులను సముదాయించారు. టోల్‌ప్లాజా సిబ్బందిని పిలిపించారు. త్వరలోనే సర్వీస్ రోడ్డు పనులను ప్రారంభిస్తామని వారు హామీ ఇవ్వడంతో ఆందోళనకారులు శాంతించారు. ఎంపీటీసీ ఎంబడి సంతోషం, సొసైటీ వైస్‌చైర్మన్ కుమ్మరి చిన్న గంగారాం, ఉపసర్పంచులు పాల్గొన్నారు.

టీటీడీసీ తాత్కాలిక సిబ్బంది తొలగింపు

డిచ్‌పల్లి: మండలకేంద్రంలోని ట్రైజం ట్రైనింగ్ డెవలప్‌మెంట్ సెంటర్ (టీటీడీసీ) లో సుమారు 20 ఏళ్లుగా విధులు నిర్వహిస్తున్న తాత్కాలిక సిబ్బందిని ఉన్నతాధికారులు విధుల నుంచి తొలగించారు. జిల్లాలోని వివిధ శాఖల ఉద్యోగులు, సిబ్బందికి ఈ కేంద్రంలో పలు రకాల శిక్షణ కార్యక్రమాలు నిర్వహించేవారు. ఇందుకోసం తాత్కాలిక ప్రాతిపదికన సిబ్బందిని నియమించారు. ఏళ్లుగా వారితో పనులు చేయించుకుంటూ వచ్చారు. శిక్షణల ద్వారా వచ్చే ఆదాయంతోనే ఈ కేంద్రాన్ని నిర్వహించేవారు. కానీ కరోనా, లాక్‌డౌన్ తదితర పరిణామాల నేపథ్యంలో టీటీడీసీలో శిక్షణలు, సమావేశాలు పూర్తిగా తగ్గిపోయాయి. ఒకప్పుడు రోజుకు మూడు నాలుగు శాఖల ఉద్యోగులకు శిక్షణ కార్యక్రమాలతో బిజీగా ఉండే టీటీడీసీ ఇప్పుడు కేవలం నెలకు రెండు రోజుల పాటు జిల్లా సమాఖ్య సమావేశాలకు మాత్రమే పరిమితమైంది. దీంతో కేంద్రం నిర్వహణ డీఆర్‌డీఏకు భారంగా మారింది. ఖర్చు తగ్గించుకోవడంపై దృష్టిసారించిన ఉన్నతాధికారులు ముందుగా తాత్కాలిక సిబ్బందిని తొలగిస్తూ నిర్ణయం తీసుకున్నారు. దీంతో తొలగింపునకు గురైన సిబ్బంది వీరయ్య, అన్వర్, దుర్గయ్య, సునీత, మాలాబీలు గురువారం మీడియాతో మాట్లాడారు. డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో డిచ్‌పల్లిలో టీటీడీసీ ప్రారంభం అయినప్పటి నుంచి తాము విధులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నెలకు రూ.300 వేతనంతో ప్రారంభించి ఇప్పుడు రూ.6వేల వేతనంతో పని చేస్తున్న తమను అర్ధంతరంగా తొలగిస్తే రోడ్డున పడతామని వాపోయారు. కలెక్టరేట్ స్పందించి తమకు ఎక్కడైనా ఇతర శాఖల్లో పని కల్పించి ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాలు, నిధుల కొరతతోనే సిబ్బందిని తొలగించినట్లు ఇన్‌చార్జి నర్సింహాలు పేర్కొన్నారు.

‘స్త్రీ నిధి’ అవకతవకలపై విచారణ

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండలంలోని కిచ్చన్నపేటలో మహిళాసంఘాల సభ్యులకు సంబంధించి స్త్రీనిధి రుణ వాయిదాల చెల్లింపుల్లో జరిగిన అవకతవకలపై గురువారం జిల్లా సెర్ప్ అధికారులు విచారణ చేపట్టారు. ‘సాక్షి’ దినపత్రికలో ‘స్త్రీనిధి రుణవాయిదాల చెల్లింపుల్లో చేతివాటం’ శీర్షికన ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఈమేరకు బ్యాంకులింకేజీ డీపీఎం రవీందర్‌రావు, స్త్రీనిధి రీజనల్ మేనేజర్ శ్రీనివాస్, జిల్లా మేనేజర్ కిరణ్, అసిస్టెంట్ మేనేజర్ శ్రీనివాస్ గ్రామానికి చేరుకొని ఉదయం నుంచి సాయంత్రం వరకు విచారణ జరిపారు. గ్రామంలోని 11మహిళా సంఘాలకు సంబంధించి అందుబాటులో ఉన్న సభ్యులు చెల్లించిన స్త్రీనిధి రుణ వాయిదాల వివరాలను వారు క్షుణ్ణంగా పరిశీలించారు. గురువారం సాయంత్రంనాటికి రూ.లక్షా45వేలు పక్కదారి పట్టినట్లు గుర్తించారు. విచారణ ఇంకా పూర్తికాలేదని, సోమవారం నాటికి విచారణ పూర్తిచేసి జిల్లా అధికారులకు నివేదిక అందజేస్తామని వారు చెప్పారు. కాగా గ్రామంలో ఇదివరకు విధులు నిర్వహించిన వీవోఏ లక్ష్మీనారాయణ, అప్పటి సీసీ బూస స్వామి నిర్లక్ష్యం కారణంగా స్త్రీనిధి రుణవాయిదాల చెల్లింపుల్లో అవకతవకలు జరిగాయన్నారు. విచారణ పూర్తయ్యాకా బాధ్యులపై చర్యలు తీసుకుంటామని వారు తెలిపారు.

నేరుగా బ్యాంకుల్లోనే చెల్లించాలి...

మహిళా సంఘాల సభ్యులు తీసుకున్న రుణాలకు సంబంధించిన వాయిదాల డబ్బులను వీవోఏల చేతికిగాని, సీసీల చేతికిగాని ఇవ్వకూడదని డీపీఎం రవీందర్‌రావు తెలిపారు. సభ్యులు నేరుగా బ్యాంకులలో గానీ, ఫోన్‌పే ద్వారా గానీ చెల్లించాలన్నారు. రుణాలు తీసుకున్నప్పుడు ఎవరికి కూడ ఎలాంటి నగదు ఇవ్వకూడదన్నారు. కేవలం సర్వీస్ చార్జీలకు సంబంధించి రూ.300 మాత్రమే బ్యాంకు అకౌంట్ ద్వారా సంఘం ఖాతాలో జమ చేయాలని వివరించారు. ఏపీఎం జగదీశ్, సీసీలు ఉన్నారు.



విచారణ జరుపుతున్న జిల్లాఅధికారులు

క్రైం కార్నర్

టిప్పర్ ఢీకొని ఒకరి మృతి



చంద్రశేఖర్ (ఫైల్)

మాచారెడ్డి(కామారెడ్డి): రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రానికి చెందిన ఓ వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మాచారెడ్డి ఎస్సై సంతోష్ తెలిపిన వివరాలు ఇలా.. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రానికి చెందిన గోగికర్ చంద్రశేఖర్(32) మటన్ వ్యాపారం చేసుకొని జీవించేవాడు. గురువారం సొంత పనుల నిమిత్తం తన బైక్‌పై సిరిసిల్ల నుంచి కామారెడ్డి వచ్చి, తిరిగి సిరిసిల్లకు బయలుదేరాడు. మాచారెడ్డి మండలంలోని ఘన్‌పూర్ శివారులోగల కామారెడ్డి-సిరిసిల్లా రహదారిపై అతడి బైక్‌ను ఎదురుగా అతి వేగంగా అజాగ్రత్తగా వస్తున్న టిప్పర్ ఢీకొట్టింది. ప్రమాదంలో చంద్రశేఖర్ తీవ్రంగా గాయపడగా.. స్థానికులు అతడిని కామారెడ్డి జిల్లాకేంద్ర ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

చికిత్స పొందుతూ ఒకరు..

మోపాల్(నిజామాబాద్‌రూరల్): మండలంలోని న్యాల్‌కల్ గ్రామానికి చెందిన సంజీవ్ (38) ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడగా.. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. గ్రామస్తులు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాలు ఇలా.. సంజీవ్ గత సోమవారం దుబ్బాకలో ఓ శుభకార్యానికి వెళ్లి, తిరిగి వస్తుండగా.. రామడుగు వద్ద బైక్ అదుపుతప్పి పడిపోయాడు. ప్రమాదంలో సంజీవ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. అప్పటి నుంచి నగరంలోని ఓ ప్రయివేటు ఆస్పత్రిలో చికిత్స పొందాడు. గురువారం పరిస్థితి విషమించి మృతిచెందాడు. మృతుడికి భార్య స్రవంతి,ఇద్దరుకూతుర్లు,కొడుకు ఉన్నారు.

అనుమానాస్పద స్థితిలో ఒకరు..



మృతి చెందిన మక్బుల్

నిజాంసాగర్(జుక్కల్): మండలంలోని నిజాంసాగర్ ప్రాజెక్టు నీటిలో ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. మండలంలోని అచ్చంపేట గ్రామానికి చెందిన మహమ్మద్ మక్బుల్(30) ప్రాజెక్టు గుల్‌దస్తా వద్ద పల్లీలు అమ్ముతూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఈక్రమంలో గురువారం ఉదయం ఇంటి నుంచి వెళ్లిన మక్బుల్ ప్రాజెక్టు నీటిలో శవమై తేలాడు. ప్రమాదవశాత్తు ప్రాజెక్టు కట్టపై నుంచి జారి పడి మృతి చెందాడా? లేక ఎవరైనా ప్రాజెక్టులోకి తోసివేశారా? అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. మృతుడికి భార్య సమీనా, కూతురు, కుమారుడు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై రాజేశ్వర్ తెలిపారు.

బైక్‌ల చోరీ కేసులో ఇద్దరి అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న సీఐ సురేందర్‌రెడ్డి

మోపాల్(నిజామాబాద్‌రూరల్): సులువుగా డబ్బులు సంపాదించాలనే ఆశతో బైక్‌ల చోరీలకు పాల్పడుతున్న ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు సౌత్ రూరల్ సీఐ ఎంవీ సురేందర్‌రెడ్డి తెలిపారు. మండలకేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలోని కంజర్ గ్రామానికి చెందిన షేక్ అఫ్రోజ్ మటన్ షాప్‌లో, వర్ని మండలం తగ్గేపల్లికి చెందిన మహ్మద్ ఇనాయత్ అలీ కూలీ పని చేస్తూ జీవనం సాగించేవారు. మే 7న ఆర్యనగర్ కాలనీలో గల వైన్స్ ఎదుట ఉన్న ప్యాషన్ ప్రో బైక్, 10న కంజర్‌లో మరో ప్యాషన్ ప్రో బైక్‌ను దొంగిలించి షేక్ అఫ్రోజ్ ఇంటి వద్ద దాచిపెట్టారు. గురువారం మోపాల్ సమీపంలో ప్రెసిడెన్సీ స్కూల్ సమీపంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా మహ్మద్ ఇనాయత్ అలీ చోరీ చేసిన బైక్‌పై వెళ్తుండగా పట్టుకున్నారు. రెండు బైక్‌లను దొంగిలించినట్లు ఒప్పుకున్నారు. బైక్‌లను స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. వీరు గతంలోనే నేర ప్రవృత్తి కలిగిన ఉన్నారన్నారు. కేసు చేధించిన ఎస్‌ఐ మహేష్, కానిస్టేబుళ్లు మల్లేష్, సతీష్‌ను సీఐ అభినందించారు.

పేకాట ఆడుతున్న తొమ్మిది మంది..

గాంధారి(ఎల్లారెడ్డి): మండల పరిధిలోని ముదెల్లి గ్రామ శివారులో గురువారం పేకాట స్థావరంపై దాడిచేసి తొమ్మిది మంది పేకాట రాయుళ్లను అరెస్టు చేసినట్లు ఎస్సై సుధాకర్ తెలిపారు. గ్రామ శివారులోని చెరువు వద్దగల మర్రిచెట్టు కింద పేకాట ఆడుతున్నారనే పక్కా సమాచారం మేరకు తమ సిబ్బందితో దాడి చేశామన్నారు. పేకాట ఆడుతున్న తొమ్మిదిని అరెస్టు చేసి, వారి వద్ద నుంచి రూ.8160 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. బహిరంగ ప్రదేశంలో మద్యం సేవించినా, పేకాట ఆడినా చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు.

ఆటోను ఢీకొన్న కారు: ఆరుగురికి గాయాలు



ప్రమాదంలో ధ్వంసమైన ఆటో

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండల కేంద్రం శివారులోగల 44వ జాతీయ రహదారిపై గురువారం ఓ ఆటోను కారు ఢీకొనడంతో ఆరుగురికి గాయాలు అయ్యాయి. ఎస్సై రాజేశ్ తెలిపిన వివరాలు ఇలా.. గాంధారి మండలం పెద్ద పోతంగల్ నుంచి పలువురు ప్యాసింజర్‌లో ఆటోలో కామారెడ్డిలోకి ఆస్పత్రికి వెళ్తున్నారు. సదాశివనగర్ సమాపంలో వీరి ఆటోను వెనుక నుంచి అతివేగంతో వచ్చిన కారు ఢీకొట్టింది. దీంతో ఆటోలో ఉన్న ఆరుగురికి గాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రులను వెంటనే కామారెడ్డి ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

హైవేపై బోల్తాపడ్డ లారీ



ఇందల్వాయి: మండల పరిధిలోని మిషన్ భగీరథ రా వాటర్ పంప్‌హౌస్ వద్ద గల 44వ నంబరు జాతీయ రహదారిపై గురువారం వేకువజామున మామిడి పండ్ల లోడుతో ఉన్న లారీ బోల్తా పండింది. హైదరాబాద్ నుంచి నాగపూర్ వైపుకు వెళ్తుండగా లారీ అదుపు తప్పడంతో ప్రమాదం జరిగిందని టోల్‌ప్లాజా అధికారులు తెలిపారు. ఘటనలో డ్రైవర్, క్లీనర్ క్షేమంగా ఉన్నారని, స్థానిక పోలీసుల సహకారంతో రహదారిపై ఉన్న లారీని తొలగించి ట్రాఫిక్‌ను క్లియర్ చేసినట్లు తెలిపారు.

పశువుల పాక దహనం



ఎడపల్లి(బోధన్): మండలంలోని జానకంపేట గ్రామంలో బుధవారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ఉప్పు భూమిరెడ్డికి సంబంధించిన పశువుల పాకకు నిప్పు అంటించడంతో పూర్తిగా దగ్ధమయ్యింది. స్థానికులు మేల్కొని మంటలు ఆర్పే ప్రయత్నం చేసినప్పటికీ మంటలు అదుపులోకి రాలేదు. పికేటింగ్ చేస్తున్న ఎడపల్లి పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించడంతో అగ్నిమాపక సిబ్బంది ఫైర్ ఇంజన్‌తో వచ్చి మంటలను ఆర్పివేశారు. బాధితుడు భూమిరెడ్డి మాట్లాడుతూ.. గుర్తుతెలియని వ్యక్తులు నిప్పటించడంతో తన గుడిసెలో ఉన్న పశువుల దాన, కట్టెలు ఇతర వస్తువులు కాలిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. రూ.లక్ష వరకు నష్టం వాటిల్లిందని బాధితుడు వెల్లడించాడు. గుడిసెలో పశువులు లేకపోవడంతో తీవ్ర నష్టం జరగలేదు. పోలీసులు దర్యాప్తు చేపట్టి నిందితులకు శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వం తనకు ఆర్థిక చేయూతను అందించాలన్నారు.

బాలికపై ముణ్నెళ్లుగా అత్యాచారం

- ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటన

వర్ని: మండలంలోని ఓ గ్రామానికి చెందిన ఎనిమిదేళ్ల బాలికపై అదే గ్రామానికి చెందిన 15ఏళ్ల బాలుడు అత్యాచారం చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సదరు బాలికకు బుధవారం కడుపులో నొప్పి రావడంతో తల్లిదండ్రులు చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తీసుకువెళ్లారు. పరీక్షలు నిర్వహించిన వైద్యులు బాలిక అత్యాచారానికి గురైందని వెల్లడించినట్లు తల్లిదండ్రులు పేర్కొన్నారు. బాలికను తల్లిదండ్రులు విచారించగా ఇంటి పక్కన ఉండే బాలుడు మూడు నెలలుగా చాక్లెట్లు, బిస్కెట్లు ఇచ్చి అత్యాచారానికి పాల్పడినట్లు తెలిపింది. దీంతో బాలిక తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేయగా, రుద్రూర్ సీఐ జాన్‌రెడ్డి, వర్ని ఎస్సై అనిల్ రెడ్డిలు గ్రామానికి వెళ్లి విచారణ చేపట్టారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న బాలుడిని బాలిక కుటుంబ సభ్యులు, బంధువులు దేహశుద్ధి చేసినట్లు తెలిసింది. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

భార్య కాపురానికి రావడం లేదని ఆత్మహత్య

రామారెడ్డి: భార్య కాపురానికి రావడం లేదని జీవితంపై విరక్తి చెంది ఓ వ్యక్తి చెరువులోకి దూకి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన రెడ్డిపేట చెరువులో ఆలస్యంగా వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. కామారెడ్డి శైలన్ బాబా కాలనీకి చెందిన పసులోటి శివకుమార్ (37) పూసల వృత్తి వ్యాపారం చేస్తూ జీవనం సాగించేవాడు. ఇతనికి సిద్దిపేట జిల్లా జగదేవ్పూర్ గ్రామంకు చెందిన లావణ్యతో పది సంవత్సరాల క్రితం పెళ్లి జరిగింది. వీరికి ఇద్దరు కొడుకులున్నారు. గత రెండు సంవత్సరాల నుంచి దంపతుల మధ్య గొడవలు జరుగుతుండేవి. దీంతో ఇటీవల లావణ్య తన పిల్లలతో కలిసి తల్లిగారి ఇంటికి వెళ్లిపోయింది. తన భార్య తిరిగిరాకపోవడంతో జీవితంపై విరక్తి చెందిన శివకుమార్ ఈనెల 9న ఇంట్లో ఎవరికి చెప్పకుండా వెళ్లిపోయాడు. గురువారం రామారెడ్డి మండలంలోని రెడ్డిపేట శివారులోని చెరువులో శవమై తేలాడు. వెంటనే గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించారు. మృతుడి తండ్రి వెంకటేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై అనిల్ తెలిపారు.